క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు ఉపకరణాలు అందజేస్తున్న ప్రజారోగ్య సిబ్బంది

విజయనగరం: నగరపాలక సంస్థలో సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, ఇతర ఉపకరణాలను ప్రజారోగ్య సిబ్బంది శనివారం అందజేశారు. 25 సచివాలయాలలో మొత్తం 300 మంది పారిశుధ్య కార్మికులకు మూడు సర్కిళ్ల వారీగా ఉపకరణాలు అందజేసినట్లు సిబ్బంది తెలిపారు. మహిళలకు 3 చీరలు, 3 జాకెట్లు, 3 తువ్వాళ్లు.. పురుషులకు మూడు జతల ఖాకీ దుస్తులు, 3 తువ్వాళ్లు అందించారు. అలాగే ప్రతి ఒక్కరికీ రెయిన్ కోట్, 24 సబ్బులు, మూడు లీటర్ల కొబ్బరి నూనె కూడా అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విజయనగరం: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిక నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక ముగిసిన తర్వాత మళ్లీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పరిశ్రమ భూమికి పట్టాదారు పాస్ పుస్తకమా..?

డెంకాడ: మండలంలోని కొండరాజుపేట పంచాయతీ పరిధిలో ఓ పరిశ్రమ ఉన్న భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం . పరిశ్రమ ప్రతినిధులు కోరడమే తరువాయి రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కొండరాజుపేట పంచాయతీ పరిధిలో ఓ పరిశ్రమ ఏళ్ల తరబడి నడుస్తోంది. ఈ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం కావాలని సదరు వ్యక్తులు రెవెన్యూ అధికారులకు విన్నవించారని భోగట్టా. పరిశ్రమ ఉన్న భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఎలా ఇస్తారో అర్థం కావడం లేదని పలువురు అంటున్నారు. ఏదైనా ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే ఆ భూమి వ్యవసాయేతర భూమిగా మార్చి కేటాయిస్తారు. అటువంటిది అందుకుభిన్నంగా పరిశ్రమ వారే పట్టాదారు పాస్ పుస్తకం కావాలని కోరడం వెనుక ఏదో మతలబు ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారులు ఎలా వ్యవహరిస్తారో వేచి చూడాలి మరి.

చిత్తడి నేలలను కాపాడుకోవాలి

- హెచ్ఎం వేణుగోపాలరావు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: చిత్తడి నేలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కొండగుంపాం ఉన్నత పాఠశాల హెచ్ఎం వేణుగోపాలరావు అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ.. చిత్తడి నేలలు నదీ కాలుష్య కారకాలను ఇముడ్చుకుంటాయని, ఎగువ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా కాపాడుతాయని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ కో ఆర్డినేటర్ సత్యప్రకాష్, ఉపాధ్యాయుడు సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



రెల్లివలస పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ జీవనరాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ, వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భాగ్యరేఖ, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం రేపు

నెల్లిమర్ల: నగరంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఈ నెల 3న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానాచార్యులు ఎం. శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీదేవి ఆవిర్భవించిన పవిత్ర దినం మాఘమాస పంచమి సందర్భంగా ఉదయం 9.45 గంటలకు విఘ్నేశ్వర పూజ, గాయత్రీ హోమం, పూర్ణాహుతి, సరస్వతీ అష్టోత్తరపూజ, అక్షర స్వీకారం కార్యక్రమాలు జరిపిస్తామని పేర్కొన్నారు. అక్షరాభ్యాసానికి అవసరమైన సామాగ్రిని తల్లిదండ్రులు తెచ్చుకోవాలని ప్రధానాచార్యులు సూచించారు.

అదుపు తప్పితే అంతే..

- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వేలాడుతూనే ప్రయాణిస్తున్న వైనం



పూసపాటిరేగలో బస్సు ఎక్కేందుకు ఉన్న విద్యార్థులు

పూసపాటిరేగ: పెరిగిన జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు మెరుగుపడకపోవడంతో విద్యార్థులు రాకపోకలు సాగించడానికి నరకయాతన పడుతున్నారు. మండల కేంద్రానికి నుంచి నిత్యం సుమారు మూడు వేల మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. దీంతో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు.. సాయంత్రం 3 గంటల నుంచి 4 మధ్య వాహనాలు కిటకిటలాడుతుంటాయి. విద్యార్థులకు సరిపడా బస్సులు లేకపోవడంతో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పూసపాటిరేగ జంక్షన్ నుంచి రణస్థలం, చింతపల్లి, తిప్పలవలస, భోగాపురం వైపు వెళ్లే బస్సులు ఎక్కాలంటే హడలిపోవాల్సిందే. ఆ సమయంలో వందల సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు రహదారిపై బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ప్రమాదం అని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేయక తప్పని పరిస్థితి. పూసపాటిరేగలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో సుమారు మూడు వేలకు పైబడి విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం ఆయా గ్రామాల నుంచి బస్సుల ద్వారానే మండల కేంద్రానికి వస్తుంటారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో సుమారు రెండు వేల మంది పని చేస్తున్నారు. వీరిలో చాలామంది వివిధ ప్రాంతాల నుంచి పూసపాటిరేగకు వస్తుంటారు. దీంతో ఆటోలు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూసపాటిరేగ గుండా వెళ్లే ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని పలువురు కోరుతున్నారు.

పట్టుతప్పితే పరలోకానికే..

మండల కేంద్రంలోని కళాశాలకు వచ్చేందుకు నిత్యం బస్సును ఆశ్రయిస్తుంటాం. ప్రతిరోజూ బస్సులో వేలాడుతూ రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చాలీచాలని బస్సులు వేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు వేయాలి.

– శ్రీనివాస్, పైడి భీమవరం విద్యార్థి

అధికారులు స్పందించాలి..

రాకపోకలకు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను అధికారులు స్పందించాలి. దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. కళాశాలకు వచ్చే, విడిచిపెట్టే సమయాల్లో చాలా రద్దీగా ఉంటోంది. బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలి.

– మణికంఠ, కందివలస విద్యార్థి

❖ ఆత్మీయ వీడ్కోలు..



సుదీర్ఘకాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఏఆర్ హెచ్‌సీ పసుపురెడ్డి జగ్గారావులను సహచర సిబ్బంది శనివారం స్థానిక పోలీస్ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత (అడ్మిన్), అదనపు ఎస్పీ (ఏఆర్) జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

– విజయనగరం క్రైమ్

❖ పూడికతీత పనులు..

విజయనగరం మండలంలోని బియ్యాలపేట గ్రామంలో శనివారం పూడికతీత పనులు జోరుగా చేపట్టారు. కాలువల్లో మురుగు తీయడంతో పాటు దోమలు ప్రబలకుండా పారిశుధ్య సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు.

– విజయనగరం రూరల్



గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రామతీర్థంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథ్





దేవుని నెలివాడ వద్ద ఇంకుడు గుంత తవ్వుతున్న కార్మికులు

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ పంచాయతీ సిబ్బంది శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యంపై 'నెరవేరని స్వచ్ఛభారత్ లక్ష్యం' అనే శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఈఓపీఆర్‌డీ శంకర్‌జగన్నాథ్ స్పందించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్‌తో కలిసి రామతీర్థం, దేవునినెలివాడ గ్రామాల్లో పర్యటించారు. రామతీర్థం బోడికొండకు వెళ్లే సీసీ రహదారిపై మురుగునీటిని తాత్కాలికంగా బయటకి వెళ్లే ఏర్పాట్లు చేశారు. దేవునినెలివాడలో ప్రధాన రహదారి పక్కన ఇంకుడు గుంత తవ్వించి మురుగు నీరు వెళ్లే ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రామతీర్థంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని కాలువ ఏర్పాటు చేయాల్సి ఉందని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే చర్యలు చేపడతామని ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్ద కంచరాపు రాము, కార్యదర్శి సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం వద్దే పెన్షన్లు

- పెదవి విరుస్తున్న లబ్ధిదారులు

విజయనగరం రూరల్: ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా... విజయనగరంలో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వలంటీర్లను పక్కనబెట్టడంతో సచివాలయం సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని బియ్యాలపేటలో సచివాలయ సిబ్బంది శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. వాస్తవానికి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందజేయాల్సి ఉండగా.. వారినే సచివాలయానికి పిలిపించి పింఛన్లు అందజేశారు. ఒక్క బియ్యాలపేటే కాదు చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

సిగ్నల్ లేకపోవడం వల్లే..

మండలంలోని బియ్యాలపేట, కొండకరకాం గ్రామాల్లో సిగ్నల్స్ సరిగా లేవు. దీంతో పెన్షన్ లబ్ధిదారులను సచివాలయానికి పిలిపించి నగదు అందజేశాం. మిగిలిన గ్రామాల్లో ఇళ్ల వద్దే పింఛన్లు అందజేశారు.

–గంటా వెంకటరావు, ఎంపీడీఓ, విజయనగరం



బియ్యాలపేట సచివాలయం వద్ద లబ్ధిదారుడికి ఐరిష్ తీస్తున్న సిబ్బంది

అధికారులు, సిబ్బందిని ప్రశ్నిస్తే సర్వర్ సమస్య వల్ల సచివాలయం వద్ద ఇచ్చినట్లు బదులిచ్చారు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

- తహసీల్దార్ సుదర్శనరావు



నందిగామ అల్తిపాలెంలో ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో రవికుమార్

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సుదర్శనరావు హెచ్చరించారు. మండలంలోని నందిగామ అల్తిపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ సిబ్బంది శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్తిపాలెంలోని సర్వే నంబర్-3లో ప్రభుత్వ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని, ఆక్రమణదారులకు నోటీసులు అందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్కడైనా చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రవికుమార్ పాల్గొన్నారు.

మూలకు చేరుతున్న కియోస్క్‌లు



చీపురుపల్లి మండలంలోని నిమ్మలవలసలో కియోస్క్ యంత్రాన్ని వినియోగిస్తున్న రైతు(ఫైల్)



గుర్ల మండలంలోని తెట్టంగిలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

- ఆర్‌ఎస్‌కేల్లో కియోస్క్ సేవలకు మంగళం
- గత ప్రభుత్వంలో రైతులకు కియోస్క్ ద్వారా అందిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు
- ప్రస్తుతం నిలిచిపోయిన సేవలు

నియోజకవర్గంలో మండలాలవారీగా రైతుసేవా కేంద్రాలు, కియోస్క్ యంత్రాల వివరాలు...

మండలం	రైతు సేవా కేంద్రాలు	కియోస్క్ యంత్రాలు
చీపురుపల్లి	14	14
గరివిడి	21	21
మెరకముడిదాం	18	18
గుర్ల	24	24

చీపురుపల్లి: సాధారణంగా ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు కొలువుదీరినప్పుడు సరికొత్త సేవలను అమల్లోకి తీసుకురావడం చూస్తుంటాం. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం కొత్త సేవలు అందించకపోగా ఉన్న సేవలకు మంగళం పాడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పెట్టుబడి సాయం నుంచి పంటల సాగు, ఎరువుల సరఫరా, మార్కెటింగ్ వరకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలిచింది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో ఉత్పాదకతను పెంపొందిస్తూ రైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతీ సచివాల యం పరిధిలోనూ రైతుభరోసా కేంద్రాల(ఆర్బీకే)ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో కియోస్క్(డిజిటల్ టచ్ స్క్రీన్)యంత్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇళ్ల వద్దకే విత్తనా లు, ఎరువులు, పురుగు మందులు అందించేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నంత కాలం రైతులకు చక్కని సేవలందించిన కియోస్క్ యంత్రాలు ప్రస్తుతం వినియోగించకపోవడంతో దాదాపు మూలకు చేరిపోయాయి. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)గా మార్చిందే కానీ వాటిలో కొత్తగా సేవలేవీ అందుబాటులోకి తీసుకురాకపోగా...ఉన్న సేవలకు సైతం మంగళం పాడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి ఆచరణలో పెడితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నేడు

విజయనగరం టౌన్: నగరంలోని వ్యాసనారాయణ మెట్ట వద్ద ఉన్న శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉప్పాడ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డప్పు శ్రీను అభ్యుదయ బృందంతో వివిధ రకాల జానపద నృత్యరీతులు, సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద గీతాలు, కామిడీ స్కిట్స్ ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేష్‌వర్మ

విజయనగరం ఫోర్ట్: పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడిగా ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఎక్కువ సీట్లు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తనకు అందించినట్లే రాజేష్‌వర్మకు సహాయ సహకారాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ కన్వీనర్ లక్ష్మి నరసింహం, ఎన్నికల అధికారి పైడి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి..

- జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



కలెక్టర్ అంబేడ్కర్‌కి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ

విజయనగరం పూల్‌బాగ్: పట్టణానికి సమీపంలో ఉన్న జొన్నాడ టోల్‌గేట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

టోల్‌గేట్ వద్ద ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోయినా, విచ్చలవిడిగా టోల్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రులు, అధికారులు అదే దారిలో రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ పరిశీలన



ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న శారదా మెటల్స్ అండ్ అలోస్ సంస్థ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: శారదా మెటల్స్ అండ్ అలోస్ సంస్థ (కంటకాపల్లి) సీఎస్సార్ నిధులతో పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆ సంస్థ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. 500 మంది విద్యార్థులకు సరిపడా శుద్ధ నీటిని ప్లాంట్ అందిస్తుందని ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఆ సంస్థ డీజీఎం హనుమంతు సన్యాసిరావు, అసిస్టెంట్ మేనేజర్ జి.శంకరరావు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే నైపుణ్యాలపై ఐటీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీఐ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు కాలువ ప్రక్షాళనకు ప్రణాళికలు



అధికారులతో చర్చిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

- చెరువును పరిశీలించిన నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: నగరంలోని పెద్ద చెరువు అవుట్ ఫాల్ నుంచి విస్తరించిన కాలువను ప్రక్షాళన చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఇంజినీరింగ్, ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం ఉదయం పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ముందుగా లోవర్ ట్యాంక్‌బండ్ రోడ్డు వద్దనున్న పెద్ద చెరువు అవుట్ ఫాల్ స్థితిగతులను పరిశీలించారు. అక్కడి నుంచి ధర్మపురి వరకు ఉన్న కాలువ పరిస్థితిని ఆసాంతం గమనించారు. కాలువ ప్రాంతం మొత్తం గమనించి వర్షపు నీరు నిలువ లేకుండా సజావుగా ప్రవహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ.. నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించేందుకు కాలువ విస్తరణకై ప్రాథమిక అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆ తర్వాత పద్మావతినగర్ ప్రాంతంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కొంత మంది వృద్ధులకు ఆయనే స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం గుణుపూరు పేటలోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. 1100 మీటర్ల మేర ప్రహరీ నిర్మించేందుకు సైట్ ప్లాన్ తయారు చేయాలని టౌన్ సర్వేయర్, ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పీఎస్ఆర్ కాలనీలో ఉన్న కార్పొరేషన్ పార్కును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, టౌన్ సర్వేయర్ సింహాచలం, డీఈలు శ్రీనివాసరావు, ప్రసాద్, ఏఈలు, ప్రజారోగ్య పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.